www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 16 నవంబర్ 2024
5
వైఎస్ఆర్



'పోసాని'పై రిమ్స్ పిఎస్‌లో ఫిర్యాదు


ప్రజాశక్తి - కడప అర్బన్

వైసిపి నాయకులు, సినీనటులు పోసాని కృష్ణ మురళిపై శుక్రవారం రిమ్స్ పోలీస్‌స్టేషన్‌లో నగరంలోని 15వ డివిజన్ టిడిపి ఇన్‌ఛార్జి, నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య ఫిర్యాదు చేశారు. మీడియాలో చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ బాబు పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సుబ్బయ్య పోలీసులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.


సిఐకి ఫిర్యాదు చేస్తున్న కొండా సుబ్బయ్య

'మైలవరాని'కి మరమ్మతులేవీ!

- తాజా బడ్జెట్‌లోనూ అనిశ్చితే
- రూ.80 కోట్ల ప్రతిపాదనలు గాలికి
- రెండేళ్లకుపైగా కోల్డ్‌స్టోరేజీలోనే..





మైలవరం రిజర్వాయర్ మరమ్మతులకు నిరీక్షణ తప్పడం లేదు. 2022 ఆగస్టులో జిల్లా నీటిపారుదలశాఖ రూ.80 కోట్లతో ప్రతిపాదనలు అందజేసింది. రాష్ట్ర ఇరిగేషన్ ఇంజినీరింగ్ విభాగం రిమార్క్స్ పేరిట వెనక్కి పంపించింది. జిల్లా నీటిపారుదలశాఖ ఇంజినీరింగ్ యంత్రాంగం రిమార్క్స్‌ను పరిశీలించి మళ్లీ ప్రతిపాదనల్ని పంపించింది. అయినప్పటికీ సుమారు రెండేళ్లుగా పాలనామోదానికి నిరీక్షించాల్సి వస్తోంది. పాలనా మోదం అనంతరం సాంకేతిక అనుమతులు, టెండర్లు, అగ్రిమెంట్ల వ్యవహారం పూర్తి చేసే సమయానికి పుణ్యకాలం ముగియనుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ మైలవరం రిజర్వాయర్ మరమ్మతుల ప్రస్తావన కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని భారీ సాగునీటి ప్రాజెక్టుల్లో మైలవరం ప్రధానమైంది. ఇటు వంటి ప్రాధాన్యత ప్రాజెక్టు రెండేళ్ల కిందట కురిసిన భారీ వర్షాల ధాటికి మరమ్మతులకు గురైంది. రాయలసీమకే తలమానికమైన గండికోట రిజర్వాయర్‌కు అనుసంధానమై ఉంది. 9.99 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో కూడిన 74 వేల ఎకరాల ఆయకట్టును కలిగి ఉంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు మరమ్మతులకు రూ.80 కోట్లతో కూడిన ప్రతిపాదనలు ఏడాదిగా ఆమోదానికి నోచుకోవడం లేదు. గతేడాది కురిసిన భారీ వర్షాల కారణంగా మైలవరం రిజర్వాయర్ రివిట్‌మెంట్ దెబ్బతింది. దీంతోపాటు రిజర్వాయర్ బ్యూటిఫికేషన్ నిమిత్తం పంపించిన ప్రతిపాదనలకు రిమార్క్స్ పేరిట పాలనా యంత్రాంగం వెనక్కి పంపించింది. దీంతో జిల్లా నీటి పారుదలశాఖ రిమార్క్స్‌ను సవరించిన ప్రతిపాదనల్ని మళ్లీ పంపించింది. నెలల తరబడి ఎటువంటి కదలిక లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

మరమ్మతులకు మోక్షం లేనట్లే!

మైలవరం రిజర్వాయర్‌కు రివిట్‌మెంట్ దగ్గర నుంచి గెస్ట్‌హౌస్, గోడలు, గేట్లు, కట్ట, లెఫ్ట్ బ్లాంక్, ప్రొటెక్షన్‌వాల్, ఫ్లడ్‌గేట్, లైటినింగ్, రహ దారి, గేట్లు, ఉత్తర, దక్షిణ కాల్వలు మొదలగు నిర్మాణ పనులు దెబ్బతిని శిథిలావస్థకు చేరువలో ఉన్నాయి. గతేడాది లెఫ్ట్ కెనాల్‌లో పెరిగిన కంప చెట్లు, ఈదర మొక్కలను తొలగించారు. మళ్లీ యథాతథ పరిస్థితులు నెల కొనడంతో ఎగ్జి క్యూటివ్ ఇంజినీర్ స్పందించి జిల్లా నీటి పారుదలశాఖ సహకారంతో రూ.80 కోట్లతో ప్రతిపాదనలను అందజేశారు. ఆమేరకు పాలనాపరమైన ఆమోదం లభించకపోవడంతో ... ఫైలు చేరుకున్నట్లు సమాచారం.

కోల్డ్‌స్టోరేజీలోనే..

2022 ఆగస్టు నుంచి అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ అనుమతుల కోసం నీటిపారుదలశాఖ నిరీక్షిస్తోంది. రాష్ట్ర నీటిపారుదలశాఖ ఇంజినీరింగ్ యంత్రాంగం రిమార్క్స్ పేరిట ఆమోదాన్ని నిలిపివేసింది. ముఖ్యమంత్రి జిల్లాకు చెందిన భారీ ప్రాజెక్టు పరిస్థితి ఇలా ఉంటే మిగిలిన మధ్య తరహా, చిన్న తరహా ప్రాజెక్టుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవాల్సిందే. రాబోయే వేసవి సీజన్‌లో మరమ్మతులకు అవసరమైన వాతావరణం ఏర్పడింది. వేసవి సీజన్‌లో మరమ్మతులు చేసి వర్షాకాలం నాటికి సిద్ధం చేసుకు నేందుకు అవకాశం ఉంది. లేనిపక్షంలో నవంబర్, డిసెంబర్ మాసాల్లో వరదలు వస్తే మైలవరం ప్రాజెక్టు పరిస్థితేమిటో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా నీటిపారుదలశాఖ స్పం దించి మైలవరం సాగునీటి ప్రాజెక్టు మర మ్మతుల పనులకు పాలనామోదం ఇవ్వడంతోపాటు పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిపై బాధ్య ఎగ్జిక్యూటివ్ ఇంజినీరును సంప్రదించగా ప్రతిపాదనలు ఆమోదం లభించిన వెంటనే పనులు చేపడతామని పేర్కొనడం గమనార్హం.

నిబంధనల మేరకే ఇసుక సరఫరా

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప

స్థానిక అవసరాల నిమిత్తం ఉచిత ఇసుక సరఫరా ఉంటుందని, ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇసుక రీచ్‌ల నుంచి తీసుకెళ్లాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శుక్రవారం అమరావతి నుండి స్థానిక అవసరాల నిమిత్తం ఉచిత ఇసుక పంపిణీ విధానంపై మైన్స్, జియాలజీ ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తోపాటు జెసి అదితి సింగ్, మైన్స్, అనుబంధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా విసి ద్వారా మాట్లాడారు. స్థానిక అవసరాల కోసం వినియోగం కోసం ముందస్తు సమాచారం, ఇసుక బుకింగ్ రిజిస్ట్రేషన్లు, పంపకాల స్థితి, మాన్యువల్ రీచ్‌ల నిర్వహణ, టెండర్ల ఖరారు, రేటు స్వీకరణ, మినరల్ డీలర్ల లైసెన్స్ (ఎండిఎల్) స్థితి, బల్క్ యూజర్ సమస్యలు, జిల్లాలో ప్రస్తుత నిర్వహణ చార్జీల ధరలు, ఇసుక రవాణా నిర్వహణకు అందిన ఫిర్యాదులు, పరిష్కారాలు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. గ్రామాల్లో స్థానిక అవసరాల కోసం స్థానిక ప్రాంతాల్లో లభ్యమయ్యే ఇసుకను ఎడ్లబండ్లతో పాటు, ట్రాక్టర్లలో ఉచితంగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వాణిజ్యపరంగా వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు దిశ నిర్దేశం చేశారు. టెండర్ల ప్రక్రియను వారం రోజుల్లోగా అన్ని జిల్లాల్లో పూర్తి చేయాలన్నారు. సిఎస్ విసి ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్థానిక అవసరాల ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రాంతాల్లో లభ్యమయ్యే ఇసుకను స్థానిక అవసరాల కోసం ఎడ్లబండ్లు, ట్రాక్టర్లలలో ఉచితంగా రవాణా చేసుకొని వినియోగించుకోవచ్చునని, ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి వాణిజ్యపరంగా వినియోగిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇసుక రవాణాలో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా ప్రజలకు పారదర్శకంగా అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సాండ్ మేనేజ్మెంట్ సిస్టమ్ పోర్టల్‌లో స్థానిక అవసరాల కోసం ఇసుక సరఫరా, సాధారణ అవసరాల కోసం ఇసుకను బుక్ చేసుకునే విధానాన్ని పరిశీలించారు కార్యక్రమంలో కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, గనులు భూగర్భ శాఖ డిడి సూర్యచంద్రరావు, గ్రౌండ్ వాటర్ అధికారులు, ఇరిగేషన్, పోలీసు, అనుబంధ శాఖల పాల్గొన్నారు.


విసిలో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్, జెసి అదితిసింగ్

నేటి నుంచి పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలు

- విద్యుత్ కాంతులతో దర్గా అలంకరణ
- 16, 17 తేదీల్లో కన్నుల పండువగా గంధం, ఉరుసు
- నేడు విద్యా సంస్థలకు సెలవు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలు శనివారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఈనెల 16 నుంచి 21 వరకు ఉత్సవాలు కొనసాగుతాయి. ఉరుసు ఉత్సవాల కోసం అధికార యంత్రాంగం, కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల సందర్భంగా 16న నగరంలోని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలకు విద్యాశాఖ సెలవు ప్రకటించింది. ప్రత్యేక ప్రార్థనలు, ఖవ్వాలి, ప్రముఖుల రాక, ఎగ్జిబిషన్, భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. ఆర్‌టిసి అధికారులు రైల్వే స్టేషన్ బస్టాండ్ నుంచి బస్సు సౌకర్యం కల్పించారు. పెద్ద దర్గా పీఠాధిపతి ఆరిపుల్లా హుసేని ఉరుసు ఉత్సవాల కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. 17న ఇదార-యే-అమీనియా చిస్తీయా వార్షిక నివేదిక. రాత్రి 9 గంటలకు ఉరుసు మహోత్సవం, ఎద్దులబండ్ల చౌహరీ ఖలీఫల చాందినీ, గంధం ఊరేగింపు, చదివింపులు, ఖవాలీ కార్యక్రమాలు ఉంటాయి. 18న తహలీల్ ఫతేహ ఉత్సవంలో భాగంగా ప్రసాద సమర్పణ, హోలీ ప్రార్థనలు, రాత్రి ప్రముఖ విద్వాంసులతో 80వ ఉర్దూ కవి సమ్మేళనం (ముషాయిరా) నిర్వహిస్తారు. 19న రాత్రి 10గంటల నుంచి తెల్లవారి 3 గంటల వరకు సమాఖానీ సజ్జదనషీన్ పీఠాధిపతి వారి ఆధ్వర్యంలో ఖవాలీ, ఖురాన్ పఠనం కార్యక్రమాలు ఉంటాయి. 20న ఫకీర్లతో పీఠాధిపతులు హాజరత్ మస్తాన్ స్వామివారి దర్శనం, జెండా ప్రతిష్ట, చదివింపులు చేస్తారు.


విద్యుత్‌కాంతుల్లో మెరుస్తున్న పెద్దదర్గా

పుస్తకాలు చదివితేనే విజ్ఞానం

ప్రజాశక్తి - కడప అర్బన్


పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్

పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానం పెరుగుతుందని ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపల్ సలీం బాషా అన్నారు. శుక్రవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల జ్ఞాపక శక్తి, ఏకాగ్రత, కమ్యూనికేషన్ నైపుణ్యాలను, మానసిక వత్తిడి తగ్గించడమే కాకుండా మానసిక అర్యోగ్యాన్ని మెరుగు పరుస్తుందని పేర్కొన్నారు. పుస్తకం హస్తభూషణం అంటే చేతికి పుస్తకం ఒక ఆభరణం లాంటిదని తెలిపారు. కానీ ఇప్పుడు ప్రతి మనిషి చేతిలో మొబైల్ ఫోన్ ఒక ఆభరణం లాగా మారిపోయిందని చెప్పారు. ఇలాంటివి వదిలేసి పుస్తకాలకు ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గ్రంథాలయాలు వ్యక్తిగత అభ్యాసాన్ని, సామాజిక అభ్యుదయాన్ని, జ్ఞానాన్ని పెంపోదించుకోవడంలో కీలక పాత్ర వహిస్తాయని పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దిన్ మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా కొత్త విషయాలు తెలుసుకోవడానికి, వివిధ రంగాలపైన అవగాహనా పెంచుకోవడానికి వీలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబేరియన్ పవన్ కుమార్, అసిస్టెంట్ లైబ్రేరియన్ నాదెండ్ల బాబి, లైబేరియన్స్, సురేష్, జేమ్స్ గ్రంథాలయ సిబ్బంది రాజ్ కుమార్, శ్రీనివాసా చారి, మనోహర్, సుబమ్మ, రామ్ ప్రతాప్, రమణ శేఖర్ రెడ్డి, పాఠకులు పాల్గొన్నారు.

ఆదివాసీల పోరాటయోధుడు 'ముండా'

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె: జార్ఖండ్ ఆదివాసీల పోరాట యోధుడు ముండా అని డిపిఒ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. బీరస్ ముండా 150వ జయంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని ఇప్పపెంట - 2 గ్రామపంచాయతీలోని వేపమాన సత్రం బిడికిలో గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిపిఒతోపాటు డిఎల్‌పిఒ విజయభాస్కర్, ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ గిరిజన హక్కుల కోసం పోరాడిన వీరుడు మన్యం బీరస్ ముండా అని ఆయన పేర్కన్నారు. జార్ఖండ్ ప్రాంతంలో జన్మించిన ఆయన్ను ముండా తెగకు చెందిన ప్రజలు ఆయన 'భగవాన్' అని పిలిచేవారని, ఆదివాసీల సాగుభూములపై విధిస్తున్న పన్నులకు వ్యతిరేకంగా బ్రిటిష్ వారిపై పోరాడి అమరుడయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు, టిడిపి నాయకులు, గిరిజన ప్రజలు, మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేస్తున్న సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సదానంద గౌడ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం వీణ విజయరామరాజు ఎస్‌టియు భవన్‌లో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపుగా లక్షలాది కుటుంబాలు సిపిఎస తో ఇబ్బంది పడుతున్నాయని తెలిపారు. చాలా రాష్ట్రాలు సిపిఎస్‌ను రద్దు చేసే విధంగా చర్యలు తీసుకున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం వారంలోగా సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చినా కూడా అమలు కాకపోవడం బాధాకరమన్నారు. పాత పెన్షన్ విధానం తప్ప ఏ పెన్షన్ విధానమూ అంగీకారం కాదని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు కె.సురేష్ బాబు, కె.బాలగంగిరెడ్డి, జిల్లా అధ్య క్షులు ఎస్.ఎం.డి ఇలియాస్ బాషా, రాష్ట్ర మునిసిపల్ కన్వీనర్ రవిశంకర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ వెంకట సుబ్బయ్య,సనా వుల్లా భాస్కర్ ,పుల్లయ్య పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలు బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేస్తూ, విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్. వీరిపోగు రవి పిలుపునిచ్చారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాదీవెన, వసతిదీవన బకాయిలు రూ.3,480కోట్ల విడుదలకు ప్రభుత్వం తాత్సారం చేస్తోందని చెప్పారు. ఇప్పటికే ఎస్ఎఫ్ఐ పలుమార్లు విన్నవించినా ప్రభుత్వం జాప్యం చేస్తూ కల్లబొల్లి మాటాలు చెప్తుందని వాపోయారు. అందుచేతనే రాష్ట్ర వ్యాప్త విద్యార్థులందరిని కలుపుకుని ధర్నా చౌక్‌లో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు కదలిరావాలని పిలుపునిచ్చారు.


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రిన్సిపల్ రవీంద్రనాథ్

విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదగాలి

ప్రజాశక్తి - కడప

విద్యార్థులు ఉద్యోగాలు సృష్టించే వ్యవస్థాపకులుగా ఎదగాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రభుత్వ పురుషుల కళాశాల స్వయం ప్రతిపత్తి కడప రసాయన శాస్త్ర విభాగం, ఐక్యుఎసి ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ స్టార్ స్టేటస్ ప్రోగ్రాంలో భాగంగా 'గుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్' అనే అన్న అంశంపై శిక్షణ విజయవంతంగా నిర్వహించారు. ప్రభుత్వ పురుషుల కళాశాల, ప్రభుత్వం మహిళా కళాశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలని పేర్కొన్నారు. స్టార్ట్ డిబిటి కో-ఆర్డినేటర్ డాక్టర్ వై సావిత్రి స్టార్ కళాశాల స్టేటస్ ప్రోగ్రాం కింద జరిగే అన్ని కార్యక్రమాలలో విద్యార్థులు విశేషంగా పాల్గొని లబ్ధి పొందాలని అన్నారు కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి రమేష్, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ బి రామచంద్ర, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ బి. రాజేశ్వరి, విభాగాధిపతి డాక్టర్ పి .రవి శేఖర్, కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటసుబ్బయ్య, రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సి నాగేశ్వరెడ్డి, డాక్టర్ బి మహేష్, షాహిన్ పాల్గొన్నారు

శబరిమలకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి -కడప అర్బన్ : అయ్యప్ప స్వామి భక్తుల కోసం ఎపిఎస్‌ఆర్‌టిసి జిల్లాలోని వివిధ డిపోల నుంచి అధునాతన, నూతన ఆర్‌టిసి బస్సులను అద్దె ప్రాతిపదికన శబరిమలకు నడిపేందుకు సిద్ధంగా ఉందని జిల్లా ప్రజా రవాణా అధికారి పి. గోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు రోజుల ప్రయాణానికి బస్సులను అద్దెకు తీసుకున్న అయ్యప్ప భక్తుల గురుస్వాములకు రూ.5వేలు పారితోషకం ఇస్తామని పేర్కొన్నారు. వంట వారికి, కన్నె స్వాములు సహాయకులు ఏడుగురికి ఉచిత ప్రయాణం కల్పిస్తామని తెలిపారు. వివరాలకు స్థానిక ఆర్‌టిసి డిపోలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

కడప అసెంబ్లీ సమన్వయకర్తగా బండి జకరయ్య

ప్రజాశక్తి - కడప



కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ నియోజకవర్గం కో- ఆర్డినేటర్‌గా పార్టీ సీనియర్ నాయకులు బండి జకరయ్యను ఆ పార్టీ రాష్ట్ర అధిష్టానం నియమించింది. ఆ మేరకు ఉత్తర్వులను శుక్రవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం తనపై ఎంతో నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించి నందుకు శక్తివంచన లేకుండా పనిచేసి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి - కడప

జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని రాజీమార్గం ద్వారా తమ కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్ బాబా ఫక్రుద్దీన్ విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి సమాచారం కోసం 08562-258622, 244622లలో సంప్రదించాలన్నారు.

విస్తృతంగా టిడిపి సభ్యత్వం

ప్రజాశక్తి - కమలాపురం టౌన్

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహా రెడ్డి, కమలాపురం శాసన సభ్యులు పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి ఆదేశాల మేరకు కమలాపురం నగర పంచాయతీలోని 19వ బూత్‌లో సిహెచ్‌సి మాజీ చైర్మన్ జంపాల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రూ.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి

'సీమ'కు అనాదిగా అన్యాయమే

- వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప

రాయలసీమకు అనాదిగా అన్యాయం జరుగుతూనే ఉందని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సీమకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునేది లేదని, కలిసి వచ్చే పార్టీలతో పెద్ద ఎత్తున వైసిపి ఉద్యమం కొనసాగిస్తుందని హెచ్చరించారు. శుక్రవారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమను అందరూ విస్మరించినా జగన్మోహన్ రెడ్డి హయాంలోని మేలు జరిగిందని పేర్కొన్నారు. హై కోర్టు కోసం బార్ కౌన్సిల్ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వంలో హెచ్ఆర్‌సి, వక్ఫ్ ట్రిబ్యునల్, సిబిఐ కోర్టు కర్నూలులో పెట్టారు అని తెలిపారు. అన్నీ ప్రాంతాలు అభివృద్ధి చెందాలని జగన్ మూడు రాజధానుల పేరుతో కర్నూలు న్యాయ రాజధానిగా ప్రకటించారు అన్నారు. రెండో లా యూనివర్సిటీని కూడా కర్నూలులో పెట్టాలని ఆలోచించి భూమి, 100 కోట్ల నిధులు కూడా కేటాయించారని తెలిపారు. కొప్పార్తి ఎంఎస్ఎంఇ టెక్నాలజీ సెంటర్‌ను కూడా చంద్రబాబు తరలించుకుపోయారని విమర్శించారు. ఇంతటి దుర్మార్గాలను ఒక్క చంద్రబాబు మాత్రమే చేస్తున్నారని ఆరోపించారు. రాయలసీమకు జరుగుతున్న తీరుపై టిడిపి, జనసేన, బిజెపి నేతలు నోరు విప్పాలన్నారు. అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదని, ఇందుకు పదిరెట్లు అనుభవించక తప్పదని హెచ్చరించారు. వైసిపి వారిపై పెట్టిన అసభ్య పోస్టులపై మాత్రం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో నాయకులు దే రెడ్డి ఆదిత్య, బిహెచ్. ఇలియాస్, రామకృష్ణారెడ్డి, పులి సునీల్ కుమార్, పాకా సురేష్, రామకృష్ణారెడ్డి, కరీముల్లా పాల్గొన్నారు.

18న పిఎఫ్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇపిఎఫ్- 95 పెన్షన్ దార్ల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 18న పిఎఫ్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా జయప్రదం చేయాలని పెన్షనర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస పెన్షన్ రూ.9 వేలు, డిఎ చెల్లించాలని తెలిపారు. హైయ్యర్ పెన్షన్ అందరికీ ఇవ్వాలని, ఇపిఎస్ పెన్షనర్లకి ఉచితంగా ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలు చేయాలన్నారు. సీనియర్ సిటిజన్స్ అందరికీ రైలు ప్రమాణాల్లో రాయితీని తిరిగి కొనసాగించాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్నహైయ్యర్ పెన్షన్ దరఖాస్తులు పరిశీలించి త్వరగా పరిష్కరించాలని తెలిపారు. 10సంవత్సరాల కాలంలో కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని అఖిలభారత స్థాయిలో పెన్షన్ సంఘాలు ఢిల్లీలో ఆందోళన చేసినా ప్రభుత్వాల్లో ఎలాంటి చలనం లేదని పేర్కొన్నారు. గతంలో చలో పార్లమెంట్, వామపక్ష ఎంపీలకు పార్లమెంట్‌లో చర్చించినా కూడా కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదని చెప్పారు. ఇపిఎఫ్ డబ్బులు అంతా ఆఫీసులకు సుందరీకరణ కోసం వందలాది కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారని, ఇపిఎఫ్ కార్మికులకు పెన్షన్ ఇవ్వడానికి నాన్చుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇపిఎఫ్-95 పెన్షనర్ల పట్ల నిర్లక్ష్య ధోరణికి నిరసనగా ఈనెల 18న విద్రోహ దినం పాటించాలని అఖిలభారత కమిటీ పిలిపించిందని తెలిపారు. కార్యక్రమంలో హరిచంద్రరెడ్డి, రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన వైఎస్.సునీత


ప్రజాశక్తి - కడప ప్రతినిధి/కడప అర్బన్



తన తండ్రి వైఎ్ వివేకానందరెడ్డి హత్యకేసులో సుదీ ర్ఘంగా న్యాయం కోసం పోరాడుతున్న డాక్టర్ సునీత జిల్లా ఇన్‌ఛార్జి ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడును శుక్రవారం మద్యాదపూర్వంగా కలిశారు. ఆయన కు పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వివేకా హత్య కేసు గురించి ఎస్‌పికి వివరించారు. వివేకా హంతకులకు శిక్షపడేలా పోలీసులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వైసిపి సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డి అభ్యంతకర పోస్టులపైనా ఆమె ఎస్‌పితో చర్చించారు. అనంతరం కడప నుంచి హైదరాబాద్‌కు బయలు దేరారు. దీనిపై ఎస్‌పిని సంప్రదించగా వాస్తవమేనని, మర్యాదపూర్వకంగా కలిశారని పేర్కొనడం గమనార్హం. ఇదీలా ఉండగా గతంలో ఎస్‌పిగా ఉన్న హర్షవర్ధన్‌రాజును కూడా ఆగస్టులో వైఎస్ సునీత కలిశారు. అప్పట్లోనే విజయవాడలో హోంమంత్రి అనితను కలిసి వివేకా హంతలకుకు స్థానిక పోలీసుల అండ ఉందని సునీత ఆవేదన వెలి బుచ్చారు. సిబిఐ విచారణకు పోలీసులు సహకరించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - వేంపల్లె


ఆశీర్వాదం (ఫైల్‌ఫొటో)

వేంపల్లెలోని క్రిస్టియన్ కాలనీకి చెందిన గూడూరు ఆశీర్వాదం (58) అనే రైతు అప్పుల బాధతో గుళికల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. శుక్రవారం మృతున్ని భార్య గూడూరు జయమ్మ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆశీర్వాదం తనకున్న ఎకరా పొలంతోపాటు, కౌలుకు తీసుకుని 20 ఏళ్లుగా నుండి వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. పంటల సాగు కోసం పెట్టుబడులు రాక పోవడంతో ప్రతి ఎడాది నష్టాలను చవి చూస్తున్నాడు. ఇప్పటికే అతను రూ. 3 లక్షల వరకు అప్పులు చేశారు. రుణం ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి అధికం కావడంతో తీర్చలేక జీవితంపై విరక్తి చెంది తన పొలంలోనే గుళికల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య తప్ప పిల్లలు లేరు.

ఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్


కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎన్‌జిఒ నాయకులు

ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు బి.శ్రీని వాసులు, కార్య దర్శి డి.రవికుమార్ ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ చేకూరి శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్‌కు శాలువా కప్పి మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో అందరం కలిసి ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని చెప్పారు. ఉద్యోగుల సమస్యలు ఉంటే నేరుగా పరిష్కరించుకుందాం అన్నారు. జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ కిందిస్థాయి అధికారులు మాత్రం సచివాలయం ఎఎన్ఎంలతో ఇతర పనులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. వైద్య శాఖలోని వ్యాధినిరోధక టీకాలు, స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్, గర్భిణులు పరీక్షలు, అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ పెండింగ్, లెప్రసీ సర్వే, డైలీ రిపోర్ట్స్, ఇంకా మెడికల్ పనులు అన్నిటికీ ఆటంకాలు కలుగుతున్నాయని చెప్పారు. మెడికల్ సిబ్బందికి వేరే పనులు అప్పగించవద్దని కోరారు. అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌జి జిల్లా కార్యవర్గం నిత్యపూజయ్య, పి.శ్రీనివాసులు, బాలపులయ్య, రాజశేఖర్, నరసింహ రెడ్డి, సిటీ అధ్యక్షులు చిన్నయ్య, నాయకులు నాగార్జున, పద్మనాభం పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న డిఎస్పి వెంకటేశ్వరరావు

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - ముద్దనూరు

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేకదృష్టి సారిస్తామని జమ్మలమడుగు డిఎస్పి వెంకటేశ్వర రావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి విలేకరులతో మాట్లాడుతూ ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. చట్టవ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెండింగులో ఉన్న కేసులపై సిఐ దస్తగిరిని అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేకదృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

జబర్దస్త్ కళాకారులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని నారాయణ విద్యా సంస్థలో నిర్వహించిన పాఠశాల దశాబ్ద ఉత్సవాలు, బాలల దినోత్సవం సందర్భంగా జబర్దస్త్ కళాకారులను పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఘనంగా సన్మానించారు. గురువారం రాత్రి స్థానిక గండి రోడ్డులో నారాయణ పాఠశాలలో దశాబ్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తులసిరెడ్డి మాట్లాడుతూ కళాకారులు కారణ జన్ములని, హాస్య కళాకారులు మరి గొప్పవారని కొనియాడారు. నెహ్రూ గొప్ప దేశ భక్తుడు దార్శనికుడు, నవభారత నిర్మాత అని కీర్తించారు. విద్యార్థులు మంచి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని కోరారు. అనంతరం విద్యార్థులు, జబర్దస్త్ కళాకారులు ప్రేక్షకులను అలరించేలా సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్య అతిథులును పాఠశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మునిరెడ్డి, నాయకుడు నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, మూర్తి, రవీంద్రారెడ్డి, స్వామి శుకదేవ్, దర్బార్, కాంగ్రెస్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, రామకృష్ణ, సుబ్రమణ్యం, ఉత్తన్న, రమణ, నాగరాజు, వెంకటేష్, జబర్దస్త్ కళాకారులు హరిత, శాంతకుమార్, రైజింగ్ రాజు, ఇమ్మాన్యుయేల్, యాంకర్ మౌనిక పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తూ సర్వే చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండల పరిధిలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చౌడూరు గ్రామంలో జరుగుతున్న ఎన్‌సీడి 3.0 ఇంటింటి సర్వేను జమ్మలమడుగు డివిజన్ ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శాంతికళ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందితో మాట్లాడుతూ సర్వే సమయంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమాచారం ఎలా తెలుసుకోవాలి, వాటిని ఎలా రికార్డు చేయాలో వంటి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె ప్రజలతో మాట్లాడుతూ 18ఏళ్ల పైబడిన అందరికీ బి పి, షుగర్, ఎత్తు, బరువు, హీమోగ్లోబిన్, నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భశయ ముఖ ద్వారా కేన్సర్ వ్యాధులకు ఆరోగ్య సిబ్బంది పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ముందు రోజు ఆశా కార్యకర్తలు మీకు తెలుపుతారని, ఆ ప్రకారం ఇంటివద్ద ఉండి పరీక్షలు చేసుకొని ప్రజలు అందరూ ఆరోగ్య వంతంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బిఎ వరప్రసాద్, సీహెచ్‌ఓ గౌతమీ, ఏయన్‌యం వేదవతి, ఆశాలు పద్మావతి, సంజమ్మ పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తీకపౌర్ణమి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పలు శివాలయాల్లో కార్తీకపౌర్ణమి పురస్కరించుకొని శుక్రవారం మహిళలు ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్థానిక అగ్రహారం శివాలయంలో తెల్లవారుజాము నుంచి మహిళలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని దీపాలు వెలిగించారు. స్థానిక పిడబ్ల్యుడి బంగ్లా సమీపంలోని శివ భక్తేంద్ర ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుల్లూరు పంచాయతీ నాగ నాదేశ్వర కోనపై స్వయంభూగా వెలసిన శివుడికి మహిళలు అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక పౌర్ణమి పుణ్యదినాన్ని పురస్కరించుకొని దీపార్చన నిర్వహించారు. రంగాపురం గ్రామ స్తులమీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మిదుతూరు శివాలయంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కేసీ కెనాల్ డిప్యూటీ కలెక్టర్ మాజీ చైర్మన్ ఇట్టెం శ్రీరాములయ్య యాదవ్, మండల టిడిపి సీనియర్ నాయకులు సండెల నాగశేఖరరెడ్డి పాల్గొన్నారు.

చాపాడు: అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవాలయ ఆవరణలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు ... ఆలయ ఈఓ మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించారు. అనంతరం జ్వాలాతోరణం ఏర్పాటు చేసి స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ వీరారెడ్డి, పెరుగు నారాయణ యాదవ్, వెంకటేశ్వరరెడ్డి, ఆలయ అర్చకులు, అయ్యప్పస్వామి భక్తులు మహిళలు, పాల్గొన్నారు.

చక్రాయపేట: మండల కేంద్రంలో వెలిసిన శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ వీరభద్ర స్వామి, దేవాలయ ఆవరణలో శుక్రవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని దేవస్థాన చైర్మన్ మోపూరి రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో లక్షాధిక కార్తీక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని మట్టుపల్లె గ్రామ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అల్పాహారం ఏర్పాటు చేశారు.

కొండాపురం : కార్తీకపౌర్ణమి సందర్భంగా ఎర్రమల కొండలలో వెలసిన బాల మల్లేశ్వరుడు ఆలయంలో భక్తులు దీపాలు వెలిగించారు. ఆలయ నిర్వాహకులు మిట్టా భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేళ్ళ అంబోజిరెడ్డి, గాట్ల పెద్దరామయ్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పూజలందుకున్న బాల మల్లేశ్వరుడు

రక్త నమూనాల సేకరణ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

బోధ వ్యాధికి సంబంధించి రక్త పూతల సేకరణ శుక్రవారం మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లెలో నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధి క్యూలెక్స్ దోమ కాటుతో వస్తుందన్నారు. ఈ వ్యాధి ప్రాణాంతకం కాకపోయినప్పటికీ తీవ్రమైన శరీరక, మానసిక ఇబ్బందులు కలుగజేస్తుందన్నారు. మురుగు కాలువలో చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సిద్దయ్య సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సతీష్ కుమార్, యంఎల్‌హెచ్‌పి నిహారిక, శివ సాయితేజ, ఆరోగ్య కార్యకర్తలు గోవిందమ్మ, సరస్వతి, ఆశా కార్యకర్త భాగ్యమ్మ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

భార్యపై భర్త కత్తితో దాడి

ప్రజాశక్తి - కాశినాయన

మండల పరిధిలోని బాలరాజుపల్లె గ్రామానికి చెందిన రామిరెడ్డి ఆయన భార్య సుబ్బలక్ష్మమ్మపై శుక్రవారం కత్తితో దాడి చేశాడు. పోలీసుల వివరాల మేరకు.. రామిరెడ్డి ఆయన భార్య సుబ్బలక్ష్మమ్మను డబ్బు అడిగాడు, ఆమె ఇవ్వకపోవడంతో ఆగ్రహించి కత్తితో రెండు పోట్లు పొడిచాడు. వారి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశామన్నారు. నిందితుడ్ని వెంటనే అదుపులోకి తీసుకున్నామన్నారు. బాధితురాలిని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

ఆశాజనకంగా కంది పంట

- తగ్గిన విస్తీర్ణం..పెరుగుతున్న ధరలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



ఈ ఏడాది కంది పంట ఆశాజనకంగా ఉంది. సాధారణంగా మనకు వాణిజ్య పంటలు అనగానే ప్రత్తి, వరి, మిరప, చెరకు, మొక్కజొన్న లాంటివే గుర్తుకు వస్తుంటవి. అపరాల సాగును పెద్దగా పట్టించుకోరు. పట్టించుకొన్నా కూడా మినుము పంట గురించి ఎక్కువ శ్రద్ధ పెడతారు.. కానీ కంది పంట గురించి ఎక్కువ శ్రద్ధ పెట్టారు. ఏ పంటలు వేయడానికి కుదరని నేలలోనే కందిని సాగుచేస్తారు. ఇందుకు అనేక కారణాలు.. ప్రధానంగా కందిలో పెద్దగా ఆదాయం లేకపోవచ్చు. దానికి తోడు ఇది దీర్ఘకాలిక పంట. ఇలాంటి కారణాలతో కందికి ఇవ్వవలసిన ప్రాముఖ్యత రైతులు ఇవ్వడం లేదని చెప్పవచ్చు. ప్రాముఖ్యత పెరగాలంటే కంది పండించే రైతులకు ప్రభుత్వం రాయితీ ఇవ్వడంతోపాటు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం కంది ధర క్వింటాలకు రూ.8,200 ఉందని, ఇదే రేటు పంట వచ్చే సమయానికి ఉంటే రైతులకు మంచి ఆదాయం వస్తుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని, ఆప్రకారం రూ.65వేల నుంచి రూ.80 వేల వరకు వస్తుందని రైతులు అంటున్నారు. పెట్టుబడి పోనూ రూ.50 వేల నుంచి రూ.65 వేల వరకు మిగులుతుందని రైతులు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ ఏడాది కంది పంట ఆశాజనకంగా ఉన్నందున ధరలు కూడా ప్రస్తుతం ఉన్న ధరలు ఉండి రైతుకు మంచి జరగాలని కోరుకుందాం.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె



డిటి అమరేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న 108 సిబ్బంది

ప్రజాశక్తి - మైదుకూరు (చాపాడు)

108 ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 25 నుంచి ప్రత్యక్ష సమ్మెలోకి దిగుతామని 108 సిబ్బంది ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆ మేరకు వారు శుక్రవారం ఎంపిడిఓ శ్రీధర్ నాయుడు, డిప్యూటీ తహశీల్దార్ అమరేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ 108 పథకాన్ని ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలన్నారు. వేతన స్లాబ్స్ అప్డేట్ చేసి వేతనాలు పెంచాలన్నారు. నాలుగేళ్లుగా వేతన స్లాబ్స్‌లో ఏలాంటి మార్పు లేదన్నారు. ప్రతి సంవత్సరం ఇవ్వవలసిన ఇంక్రిమెంట్స్, వాటి బకాయిలు, ఇఎల్ నగదులను అరబిందో కంపెనీ నాలుగేళ్లుగా ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం చేస్తున్న 12 గంటల పని విధానం రద్దు చేసి 8గంటల పని అమలు చేయాలన్నారు. అంతర జిల్లా ట్రాన్స్‌ఫర్స్, చనిపోయిన ఎంప్లాయిస్‌కి రూ.20లక్షల బీమా కల్పించాలన్నారు. ఉద్యోగుల పిఎఫ్ అమౌంట్, యాజమాన్య వాటా కూడా ఉద్యోగుల వేతనాల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. గత టిడిపి ప్రభుత్వం జిఒ నెం 49 ద్వారా ప్రతి నెల రూ.4వేలు ఇచ్చేవారని, దానిని గత వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. దీన్ని పునరుద్ధరించాలని వారు కోరారు. కార్యక్రమంలో 108 సిబ్బంది రవిప్రసాద్, సాంబ శివయ్య, రమేష్, వీర కుమార్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వినియోగంతో యువత నిర్వీర్యం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మత్తు పదార్థాలను వినియోగించడం వల్ల యువత నిర్వీర్యమైపోతోందని లాయర్ భూతమాపురం వెంకట సుబ్బారావు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వశాఖ గ్రంథాలయంలో వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా లాయర్ సుబ్బారావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టం పొగాకు వినియోగం కంటే తీవ్రంగా ఉంటుందన్నారు. వీటి వినియోగానికి ఇటీవల కాలంలో యువత ఎక్కువ ఆసక్తి చూపుతూండడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన రొటేరియన్ కుండా భాస్కర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి కొంత సమయం తప్పనిసరిగా కేటాయించాలని సూచించారు. గ్రంథాలయంలో ఉండే జాతీయ నాయకుల చరిత్ర గురించి తప్పనిసరిగా తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. మంచి పుస్తకాలను తప్పనిసరిగా చదవాలన్నారు. కవి, ఉపాధ్యాయుడు అమీర్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం మార్కుల సంపాదనకే కాకుండా విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రముఖ నవలా రచయిత దర్పణం శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్నచిన్న అపజయాలకు విద్యార్థులు కుంగిపోరాదన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ జింకా చంద్రశేఖర్, లైబ్రరీ కమిటీ సభ్యులు దాదా ఖలందర్, డాక్టర్ నరసింహులు, రామయ్య, లక్ష్మీ నారాయణ, మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

రెండోరోజూ కొనసాగిన క్రీడాపోటీలు

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో రెండవ రోజు శుక్రవారం జోన్ బి4 క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ పి సురేంద్రబాబు తెలిపారు. వాతావరణం అనుకూలించడంతో విద్యార్థులు ఉత్సాహంగా ఆటల పోటీల్లో పాల్గొన్నారు. జోన్ బి4 క్రీడా పోటీల్లో 21 గురుకుల పాఠశాలల విద్యార్థులు దాదాపు 700 మంది పైబడి పాల్గొన్నారు. ఫైనల్‌లో జిల్లాస్థాయి నుండి రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా గురుకుల పాఠశాల సమన్వయ అధికారి డాక్టర్ శ్రీదేవి, చిత్తూరు జిల్లా గురుకుల డిసిఓ పద్మజ, ప్రాంతీయ అధికారి వెంకటసుబ్బయ్య, మాజీ ఆటల క్రీడాధికారి రామ చంద్రారెడ్డి, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ రామయ్య, ఎంపీటీసీ శాంతమ్మ, పిడి వైకే ఎల్లారెడ్డి, పిఈటి రవి, 21 గురుకుల పాఠశాలల పీడీలు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థులు గుర్తింపు పొందాలి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యాతోపాటు క్రీడాలల్లో కూడా విద్యార్థులు మంచి గుర్తింపు పొందాలని నారాయణ పాఠశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గండి గురుకులం పాఠశాలలో జరిగిన జోనల్ మీట్ క్రీడాలను ఆయన ప్రారభించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వాలు చాలా నిధులు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. క్రీడాకారులు స్నేహ పూర్వకంగా తోటివారితో ఉండాలని కోరారు. లక్ష్యం అనేది ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. కార్యక్రమంలో గురుకులం పాఠశాల సిబ్బంది, ఫిజికల్ డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పథకాల ముసుగులో టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందులలో టిడిపి నాయకులు పథకాల ముసుగులో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు పేర్కొన్నారు. వైయస్ మనోహర్ రెడ్డి నివాస ఆవరణలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ టిడిపి నాయకులు స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదు కార్యక్రమమని చెప్పకుండా పథకాల పేరుతో సభ్యత్వ నమోదు డబ్బులు తీసుకొని చేస్తున్నారని విమర్శించారు. సభ్యత్వ నమోదు చేయకుంటే పథకాలు రావని ప్రజలకు చెప్పడంతో వారు భయపడి చేయించుకుంటున్నారని తెలిపారు. సభ్యత్వ నమోదు చేస్తే ప్రమాద బీమా రూ.ఐదు లక్షలు వస్తుందని చెబుతున్నారని తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదని చెప్పడం లేదన్నారు. సభ్యత్వ నమోదు చేయకుంటే ప్రభుత్వ పథకాలు రావని ఇస్లాంపురం, జెండామాను వీధి, అహెూబిలాపురం తదితర ప్రాంతాలలో టిడిపి నాయకులు చెబుతున్నారని వారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజశేఖర్‌రెడ్డి, ఖాదర్ బాషా, కో-ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

స్కూల్ పేరుతో విద్యార్థులకు మోసం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎడిఫై స్కూల్ పేరుతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలను మోసం చేస్తున్న ఆ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ నాయకులు రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ గంగయ్యకు వినతిపత్రమిచ్చారు. స్థానిక దువ్వూరు రోడ్డు కామనూరు గ్రామానికి సమీపాన కుందూ నది దగ్గర ఎడిఫై ప్రయివేట్ పాఠశాల పేరుతో జీవనజ్యోతి ప్రయివేట్ పాఠశాల కరస్పాండెంట్ మరి కొంతమంది కలిసి ఎలాంటి గుర్తింపు లేకపోయినా ముందస్తు అడ్మిషన్ల పేరుతో రూ.లక్ష 20 వేల విద్యార్థుల తల్లిదండ్రులతో రాబట్టారని ఆరోపించారు. కొర్రపాడు రోడ్డులో ఒక ప్రయివేట్ బిల్డింగ్‌లో అడ్మిషన్లు జరుగుతున్నాయని బోర్డులు పెట్టి ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్నారని తెలిపారు. దీనిపై కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి తక్షణమే గుర్తింపు లేని ఎడిఫై స్కూల్ అడ్మిషన్లను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నాగరాజ్ పాల్గొన్నారు.

రక్తదాత న్యామతుల్లాకు జాతీయ అవార్డు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అన్నమయ్య జిల్లా రాయచోటి పిసిఆర్ గ్రాండ్ ఫంక్షన్‌హాల్‌లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సోమల్‌రాజ్ ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా ప్రొద్దుటూరుకు చెందిన రక్తదాత, ఆర్నాల్డ్ జిమ్ అధ్యక్షుడు షేక్ న్యామతుల్లా జాతీయ అవార్డు తీసుకున్నారు. భారత సేవారత్న నేషనల్ బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డు తీసుకున్నారు. ఈ సందర్భంగా న్యామతుల్లా మాట్లాడుతూ మానవసేవ చేసుకుంటూ రక్తదానం చేయండి.. మానవత్వాన్ని చాటండి అనే నినాదంతో ఈ రోజు ఈస్థాయికి చేరుకున్నానన్నారు. ఎవరి జీవితం శాశ్వతం కాదు.. మన చేసే సేవే శాశ్వతం అన్నారు. తనకు అవార్డును అందజేసిన సోమల్‌రాజ్ ఫౌండేషన్ నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



అవార్డు తీసుకున్న న్యామతుల్లా

గ్రంథాలయాల్లో ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న పాఠకులు, విద్యార్థులు


ప్రజాశక్తి - కమలాపురం

స్థానిక గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్స వాలలో భాగంగా రెండవ రోజు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో భా గంగా విద్యార్థులను ఉద్దేశించి మాదక ద్రవ్యాలపై చర్చించారు. తర్వాత విద్యా ర్థుల చేత పుస్తక పఠనం చేయించి పుస్తక పఠన ప్రాముఖ్యత గురించి తెలి యజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతి థిగా అల్ ఇండియా మూ మెంట్ సేవా సంస్థ వార్డెన్ కె.శ్రీవాణి, డి ఎం హెచ్ కార్యాలయం రిటైర్డ్ సూపరిం టెండెంట్ జి.ఎల్ నరసిం హులు, గ్రంథాలయ అధికారి ఎస్.నాగంజలి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** 57వ జాతీయ గ్రంథాలయం వారోత్సవాలను పురస్క రించుకొని చింతకొమ్మదిన్నె, శాఖా గ్రంథాల యంలో గ్రంథాలయ అధికారి ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాన్ని స్థానిక హోమియోపతి వైద్యులు డాక్టర్ షాకీర్ హుస్సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాల యాలు జ్ఞానాన్ని ఇచ్చే భాండాగారాలని పేర్కొన్నారు. ఈనెల 16న 6,7వ తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం, 18న 8,9 తరగతులకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రం థాలయ అధికారి ఇబ్రహీం పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **చెన్నూరు :** మండల ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాల య వారోత్సవాలను పురస్కరించుకొని గ్రంథాలయ నిర్వాహకులు కె. హరి కృష్ణ 'పుస్తక ప్రదర్శన'ను నిర్వహించారు. గ్రంథాలయ పాఠకులు, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శనను తిలకించారు. గ్రంథా లయంలో తెలుగు, ఆంగ్లం ,ఉర్దూ, హిందీ ఇతరభాషలలో కలిపిమొత్తం 11214 పుస్తకాలు అందుబాటులో ఉన్నా యన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పుస్తక ప్రదర్శనలో బాల సాహిత్యం, కథల పుస్తకాలు, దేశ నాయకుల జీవిత చరిత్రలు, వ్యక్తిత్వ వికాస పుస్త కాలున్నాయి. విద్యార్థులకు ఉప యోగపడే పోటీ పరీక్షల పుస్తకాలు ఉంచామని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు భారతి, అరుణకుమారి పాల్గొన్నారు. **వేముల :** జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఉండే విజ్ఞానమంతా ఈ పుస్తకాల్లోనే ఉందన్నారు. గొప్ప నాయకులంతా మంచి పుస్తకాలు చదవడం వల్ల వారు ఆస్థాయికి ఎదిగారని తెలిపారు. లైబ్రేరియన్ గంగాధర్ యాదవ్ మాట్లాడుతూ అన్ని రకాల పుస్తకాలు ప్రదర్శనగా ఉంచామన్నారు. కార్యక్రమంలో పాఠకులు ఎస్టిడి బాషా, ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్నా నదిలో నవ వరుడు గల్లంతు

బాలుడిని కాపాడి.. తాను చిక్కుకున్న గణేష్.. పెళ్లయి 28 రోజులే

ప్రజాశక్తి - వల్లూరు



రెడ్డిపల్లి గణేష్ (ఫైల్‌ఫోటో)

పవిత్ర పుణ్యక్షేత్రం పుష్పగిరి పెన్నా నదిలో శుక్రవారం నవ వరుడు గల్లంతయ్యాడు. బంధువుల అందించిన సమాచారం మేరకు.. కడప ఎన్జీవో కాలనీకి చెందిన రెడ్డిపల్లి గణేష్ కార్తికపౌర్ణమి సందర్భంగా పుష్పగిరిలో పూజలు నిర్వహించేందుకు కుటుంబ సమేతంగా వచ్చాడు. ఒక బాలుడు పెన్నా నదిలో చిక్కుకోగా కాపాడి, తాను సుడి గుండంలో చిక్కుకున్నాడు. జాలర్లు, ఫైర్ సిబ్బంది ఎంత వెతికినా గణేష్ ఆచూకీ దొరకలేదు. గణేష్‌కు గత నెల అక్టోబర్ 17న పెళ్లి జరిగింది. పెళ్లి జరిగి నెలరోజులు కాకముందే గల్లంతు కావడంతో భార్య, బంధువులు శోక సముద్రంలో మునిగారు. పుష్పగిరి పెన్నా నదిలో ప్రమాదక సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే చాలా బాగుంటుందని భక్తులు సూచిస్తున్నారు. ప్రమాదక సూచిక బోర్డులు ఉంటే ఇలాంటి సంఘటనలను కొంతవరకైనా అరికట్టవచ్చని పేర్కొంటున్నారు.

గ్రామాల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి - మైదుకూరు (చాపాడు)

గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శుక్రవారం మైదుకూరు శ్రీశక్తి భవన్‌లో ప్రజా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎంపిడిఓ శ్రీధర్ నాయుడు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేసుకోవడం ముఖ్యమన్నారు. ప్రజాప్రతినిధులు నిధుల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తామస్, ఈఓపీఆర్డీ సుధాకర్, మండల స్థాయి అధికారులు, టిఓటి సురేష్, ఎల్సిడి ఆపరేటర్లు రెడ్డయ్య, సంజీవ్, సర్పంచులు, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

వేముల : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేయాలని జడ్‌పిటిసి కోకటం వెంకట బయపు రెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకట నారాయణ, ఎంపిడిఓ మల్లికార్జునరెడ్డి కోరారు. ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణనిచ్చారు. ఎంపిడిఓ మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా మహాత్మ గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థల మంజూరుకు కృషి

ప్రజాశక్తి - వేంపల్లె

బలిజ సంఘం కల్యాణ మండపం నిర్మాణానికి ప్రభుత్వ స్థలం మంజూరు కోసం పులివెందుల ఇన్‌ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పేర్కొన్నారు. కార్తీక మహెూత్సవాల్లో భాగంగా స్థానిక బలిజ వీధిలో ఉన్న గౌరిదేవి ఆలయంలో 5 రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా సంఘం పెద్దలు ఆహ్వానం మేరకు రామమునిరెడ్డి దంపతులు గౌరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బలిజ సంఘం అధ్యక్షులు నంబూరు కుళాయప్ప, కటిక చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు యడాల రామా, ఎద్దుల రాములు కల్యాణ మండపం ఏర్పాటుకు స్థలం మంజూరు చేయించాలని రామమునిరెడ్డిని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు వీరభద్ర, తులసి, వెంకట్, బాబా, నామా శేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన గండి అంజన్న పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి - చక్రాయపేట



రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండిక్షేత్రంలో రామబాణంతో వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి పవిత్రోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలి పారు. ఇందులో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి నేతృత్వంలో తిరుపతి దేవస్థాన అర్చకులచే స్వామివారికి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ వెంకటస్వామి, దేవస్థాన కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకుడు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకుడు రాజా స్వామి, ఆలయ అర్చక బృందం, ఆలయ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంట రస్తాలో కాలువ ఏర్పాటు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నరహరిపురం గ్రామం వద్ద పంట కాలువను ఏకంగా రస్తాలో ఏర్పాటు చేశారు. ఈ రస్తా గుండా సుమారు 150 ఎకరాల వ్యవసాయ పనులకు రైతులు వెళ్లాల్సి ఉంది. ఒక రైతుకు సంబంధించి సాగునీరు ప్రవహించేందుకు కాలువ సమస్య ఏర్పడడంతో అధికారులు కాలువను ఏర్పాటు చేయించడంలో విఫలమై దాని పరిష్కారం కోసం ఏకంగా రాస్తాలో కాలువను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. వివరాలలోకి వెళితే.. నరహరిపురం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి అనే రైతు తనకు చెందిన 0.90 ఎకరాల పొలానికి పంట కాలువ లేకపోవడంతో పంట ఎండిపోతుందని కాలువ ఏర్పాటు చేయించాలని అధికారులకు విన్నవించుకున్నారు. సమస్యను పరిష్కరించేందుకు తహశీల్దార్ రమాకుమారి, ఎస్ఐ చిన్న పెద్దయ్య, కెసి కెనాల్ ఎఇ గురుమోహన్ రెడ్డి ప్రయత్నం చేశారు. కాలువ ఏర్పాటుకు పట్టా భూములు కలిగిన రైతులు ఒప్పుకోకపోవడంతో ఎలాగైనా రైతుకు నీరు అందించే ప్రయత్నంలో రోడ్డుపై కాలువ ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం ఈ మార్గాన పంట పొలాలు కలిగిన రైతులు పల్లా తులశమ్మ, గౌతమి, రమణమ్మ, శివ కృష్ణారెడ్డి, పుత్తా భాగ్యమ్మ, నందిమండలం రామిరెడ్డి తాము పంట పొలాలకు ధాన్యాన్ని తరలించేందుకు ఏ మార్గాన వెళ్లలో అధికారులు తెలపాలని కోరుతున్నారు.



పంట రస్తాలో ఏర్పాటు చేసిన పంట కాలువ

రేపు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాయంత్రం పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పరిపాలన అధికారి సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డి.మల్లారెడ్డి, కె.మోహన్‌రెడ్డి, శ్రీలక్ష్మి ఫైనాన్స్, ఎంఆర్ క్రియేటివ్ శ్రీగంధం ఫాంలాండ్స్ వారి సౌజన్యంతో సూర్య డ్యాన్స్ అకాడమీ మదనపల్లి వారి చిన్నారులచే జానపద, వెస్టర్న్ మొదలగు నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.